కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులను

# ప్రోత్సహిద్దాం..

## ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



**విజయవాడ బ్యూరో, మేజర్ న్యూస్ :** మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కోరారు. నగరంలోని ఎస్ ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో "సౌత్ ఇండియా ప్లాస్టిక్, ప్యాకేజింగ్, ప్రింటింగ్ ఎక్స్పో" ను రాష్ట్ర 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ప్లాస్టిక్ ఉత్పత్తుల నిర్మూలనకు వ్యతిరేకంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల **మిగతా 2లో...**

ప్రజలను చైతన్యవంతం చేయడంలో

## మీడియా పాత్ర ఎంతో కీలకం


- కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

2















## నారుమడులు పరిశీలించిన కెవికె శాస్త్రవేతలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రం, ఘంటసాల శాస్త్రవేత్తల బృందం వరి నారు మడులను పరిశీలించారు. శుక్రవారం స్థానిక పంట పొలాల్లో రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో వరి నారు మడులలో ఇనుము ధాతు లోపం వల్ల నారు పసుపు బారి ఆకులు తెల్లగా మారుతున్నాయని, జింకు ధాతు లోపము వల్ల ఆకుల పైన తుప్పు రంగు మచ్చలు ఏర్పడి ఆకుల చివర్లు ఎండిపోతున్నాయని కేవికే సమన్వయ కర్త డా సుధా రాణి రైతులకు తెలియ చేశారు. జింకు లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రా. జింకు సల్ఫేట్ ను పిచికారీ చేసుకోవాలని, ఇనుము ధాతు లోప సవరణకు లీటరు నీటికి 20 గ్రా. అన్నబేధి, 2 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని డా. సుధా రాణి రైతులకు వివరించారు. సూక్ష్మ ధాతు లోపాలతో పాటు ఎలుకలు కూడా రైతులకు నష్టాన్ని కలుగచేస్తున్నాయని వాటి యాజమాన్యం కొరకు సామూహిక చర్యలు చేపట్టాలని బ్రోమోడయాలోన్ విషపు ఎరను తయారు చేసుకుని పొలంలో పెట్టుకోవాలని వివరించారు. బ్రోమోడయాలోన్ విషపు ఎర తయారి విధానాన్ని, పాటించాల్సిన మెళుకువలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే సస్యరక్షణ శాస్త్రవేత్త డా. రేవతి, రైతులు పాల్గొన్నారు.

## మండలిని కలిసిన గుంటూరు నాయకులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసిన నాయకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట రాధా రంగా మిత్ర మండలి సీనియర్ నాయకులు అచ్చుకోల మురళి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తూబాటి రాజ్యలక్ష్మి, జనసేన పార్టీ గుంటూరు నాయకులు నిశ్శంకరరావు వెంకట శ్రీనివాసరావు, తన్నీరు రవి దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల స్థాయిలో జాతీయ సదస్సు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థాయిలో జాతీయ సదస్సు నిర్వహించడం స్ఫూర్తిదాయకమని డైరెక్టర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త అన్నారు శుక్రవారం అవనిగడ్డ లో అర్థశాస్త్ర విభాగం, ఆంధ్రప్రదేశ్ అర్థశాస్త్ర అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ సదస్సు పరిశోధనా పత్రాల పుస్తక సంకలనము "ఫిషరీస్ ఎ పొటెన్షియల్ వెకేషన్ విత్ స్పెషల్ రిఫరెన్స్ టు ఆంధ్ర ప్రదేశ్ "ని కళాశాల విద్య డైరెక్టర్ డా. నారాయణ భరత్ గుప్తా ఐ. ఏ.యస్. చేతుల మీదుగా డైరెక్టరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో విడుదల చేశారు అని ప్రిన్సిపాల్ డా.డి. ఉమా రాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, పుస్తక సంపాదకులు డా.డి. ఉమారాణి, అర్థశాస్త్ర అధ్యాపకులు, పుస్తక సంపాదకులు డా. ఎ.వీర కుమారి, చరిత్ర అధ్యాపకులు పుస్తక సంపాదకురాలు డా.డి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. కళాశాల స్థాయిలో జాతీయ సదస్సు నిర్వహించి పుస్తక సంకలనం తీసుకురావడం స్ఫూర్తిదాయకమని డైరెక్టర్ ఆఫ్ కాలేజీ ఎడ్యుకేషన్ డా. నారాయణ భరత్ గుప్తా అన్నారు.

## పెంజెండ్ర హైస్కూలుకు స్పోర్ట్స్ కిట్ అందచేత



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ జులై 11 :** పెంజండ్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి సంఘ సేవకులు తప్పిట ఈశ్వరరావు సుమారు 5000 రూపాయలు విలువగల స్పోర్ట్స్ కిట్ ను అందచేసారు. విద్యార్థుల సమక్షంలో స్పోర్ట్స్ కిట్ అందచేసిన దాత తప్పిట ఈశ్వరరావుకు పాఠశాల హెచ్ ఎం కె.నాగబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేసారు.

# కాలుష్య రహిత ప్లాస్టిక్ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం...

(మొదటిపేజీ తరువాయి)





మేరకు భూమికి, పర్యావరణానికి హానికరం కాని ఉత్పత్తులను వినియోగించేలా ప్రచార కార్యక్రమాల సైతం నిర్వహిస్తున్నామన్నారు. ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ యుగంలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలక అంశంగా మారిందన్నారు. నేడు మనం వాడుతున్న అనేక ఉత్పత్తులు ప్రకృతిని దెబ్బతీసే విధంగా తయారవుతున్నాయి. ఈ పరిస్థితిని మార్చేందుకు మనం పర్యావరణానికి మేలు చేసే ఎకో ఫ్రెండ్లీ ఉత్పత్తులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. పునర్వినియోగ, బయోడిగ్రేడబుల్, హానికారక రసాయనాలు లేని ఉత్పత్తులను ప్రోత్సహించడం వల్ల మట్టి, నీరు, గాలి కాలుష్యం తగ్గుతుందన్నారు. ఉదాహరణకు ప్లాస్టిక్ సంచీలకు బదులుగా జ్యూట్ బ్యాగులు, నైలాన్ బ్రష్‌లకు బదులుగా బ్యాంబు బ్రష్‌లు, రసాయన సబ్బుల స్థానంలో హెర్బల్ ఉత్పత్తులు వాడడం వల్ల మన ఆరోగ్యానికి, ప్రకృతికీ మేలు జరుగుతుందన్నారు. ఇటువంటి ఎక్స్పోల వల్ల ప్రజలలో అవగాహన మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. పర్యావరణ హిత ఉత్పత్తులను తయారు చేసేందుకు అవసరమైన యంత్ర పరికరాలతో కూడిన 80 స్టాల్స్ నగరంలో ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. నగరం చుట్టుపక్కల ఉన్న ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఈ ఎక్స్ పో ను సందర్శించి పర్యావరణహిత ఉత్పత్తులను తయారు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. పర్యావరణహిత ఉత్పత్తులకు ఆర్థిక సంస్థలు కూడా వేగంగా రుణాలు ఇస్తాయన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలలో భాగంగా బయోడిగ్రేడబుల్ ఆధారిత ఉత్పత్తులను ప్రోత్సహిస్తోందని తెలిపారు. "ప్రకృతికి మేలు చేయడం అంటే మన జీవితానికి విలువ చేకూర్చడం" అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకుని మనం ఎంచుకునే ప్రతి ఉత్పత్తిలో పర్యావరణ అనుకూలతను గుర్తించి, ప్రకృతిని పరిరక్షించేందుకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. మొక్కజొన్న, అరటి చెట్టు పీచు, కొబ్బరి బొండం ద్వారా లభించే పీచును సైతం పర్యావరణహిత ఉత్పత్తులకు అనుకూలంగా మార్చగలిగే యంత్ర పరికరాలు మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశంలోనే తయారు చేసేలా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలు ప్రోత్సహిస్తున్నాయ న్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, వ్యాపారవేత్త కాకాని తరుణ్, హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్. వి. స్వామి సహా పలువురు వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

# రేపు లంకమ్మ తల్లికి శాకంబరి అలంకరణ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా విరాజిల్లుతున్న అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ తల్లి అమ్మవారికి ఈ నెల 13వ తేదీ ఆదివారం శాకంబరి దేవి అలంకరణ చేయనున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ యార్లగడ్డ శ్రీనివాసు తెలిపారు. శుక్రవారం లంకమ్మ ఆలయంలో మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అతిధులుగా కూటమి నాయకులు విచ్చేయనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారిని శాకంబరీ దేవిగా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

# ప్రజలను చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకం





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమాజంలో మార్పు కోసం ప్రజలను అన్ని విధాలుగా చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకం అని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు.శుక్రవారం మచిలీపట్నం మండలం, వలందపాలెంలోని జీ కన్వెన్షన్ హాల్లో కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో వారి ఆధ్వర్యంలో వార్తలాప్ పేరుతో జర్నలిస్టులకు మీడియా కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, ఆయనతో పాటు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య, హిందూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ వీ ఎఫ్ రాయలు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షుడు బండి రామకృష్ణ తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నా, ప్రభుత్వ నిర్ణయాలు, పథకాల ఉద్దేశం ప్రజలకు చేరాలన్నా మీడియా ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో మీడియా నుంచి వచ్చే అభిప్రాయం ఫీడ్ బ్యాక్ ప్రభుత్వాలకు ఎంతో ఉపయోగపడుతుందని, దీని ద్వారా లోటుపాట్లను సరి చేసుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తద్వారా ఇది ప్రజలకు పరోక్షకంగా సహాయం చేస్తుందన్నారు.అయితే ప్రభుత్వం చేసే మంచి పనులను సైతం ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం కూడా ఎంతో ఉందని చెబుతూ, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో 16 మంది అనాథ పిల్లలను వివిధ ప్రాంతాలలో తల్లిదండ్రులకు దత్తత ఇచ్చామని అది తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఈ సందర్భంగా తెలియజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన సందర్భంలో జిల్లాలో సాధించిన అభివృద్ధిని పుస్తక రూపంలో తీసుకొచ్చామని, ఆ సమాచారాన్ని మీడియాకు త్వరలోనే అందిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకం పీఎం సూర్యఘర్ ఒక గొప్ప పథకం అని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్షిప్ (పి 4) విధానంతో సమాజంలోని ఆర్థిక అసమానతలను తొలగించేందుకు,ధనిక కుటుంబాలు పేదవారిని దత్తత తీసుకుని వారి సంక్షేమ అభివృద్ధికి కృషి చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, దీనిపై ప్రచారం కల్పించి భాగస్వామ్యం కావాలని కోరారు. ప్రకృతి వ్యవసాయంలోని ప్రయోజనాలను రైతులకు తెలియచెప్పాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందని, సామాజిక బాధ్యతగా తీసుకొని రైతులను చైతన్యవంతం చేసేలా విజయవంతమైన రైతుల విజయగాథలను ప్రచురించాలని సూచించారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతనిస్తుందని, గత సంవత్సర కాలంలో మల్లవల్లి పారిశ్రామికవాడలో 377 పరిశ్రమల ఏర్పాటుకు భూకేటాయింపులు చేశామని, ఇలాంటి అంశాలను కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా ఉన్న జర్నలిజం, రాసే నిష్పక్షపాత వార్తల వల్ల సమాజంలో గొప్ప మార్పు తీసుకురావచ్చు అన్నారు. ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల పట్ల అవగాహన కల్పించాలని, ప్రజలను చైతన్యవంతం చేసే వార్తలను రాయాలని ఆయన ఆకాంక్షించారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తున్న విధానాన్ని వివరిస్తూ, చట్టాలు, ఉచిత న్యాయ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. హిందూ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ వివిధ మీడియా చట్టాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ, రాజద్రోహం, పరువు నష్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి) కార్యకలాపాలు, అందిస్తున్న సేవలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఏడి రమేష్ చంద్ర పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీడియా అవసరాలు తీర్చడం, విలేకరుల సమావేశాలు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాలు, నీతి అయోగ్, ఎన్నికల సంఘం మొదలైన సంస్థల కార్యక్రమాల ప్రచారం తదితర విధులను పిఐబి నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డైరెక్టర్ పి రత్నాకర్, ప్రసార భారతి సీనియర్ కరస్పాండెంట్ కె నవీన్ కుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎం వెంకటేశ్వర ప్రసాద్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ, పట్టుదల, బాధ్యతల నడుమసాగే అందమైన ప్రేమకథ జయం




**సోమవారం నుంచి శనివారం వరకు రాత్రి 8 గంటలకు.. మీ జీ తెలుగులో!**

**అమరావతి, జులై 11, మేజర్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎల్లప్పుడూ వినోదం పంచే ఛానల్ జీ తెలుగు. ఊహించని మలుపులు, ఆసక్తికర కథనాలతో సాగే సీరియల్స్తో ఆకట్టుకుంటోన్న జీ తెలుగు సరికొత్త సీరియల్ 'జయం'తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేమ, మోసం, పట్టుదల, బాధ్యతల నడుమ సాగే సరికొత్త ప్రేమ కథతో రూపొందుతున్న సీరియల్ జయం. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూ ఎలా ముందుకు సాగాలో తెలిపే స్ఫూర్తివంతమైన కథతో ఈ సీరియల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆకట్టుకునే కథతో రానున్న జయం, జులై 14న ప్రారంభం, సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 8 గంటలకు, మీ జీ తెలుగులో! జయం సీరియల్ కథ మాజీ బాక్సర్ రుద్రప్రతాప్(శ్రీరామ్ వెంకట్), పేదింటి అమ్మాయి గంగావతి(వర్షిణి) జీవితాల చుట్టూ తిరుగుతుంది. రుద్ర తన సోదరుడి మరణం, చెరగని గాయాలతో కూడిన గతంతో సతమతమవుతుండగా, పేదరికం, తల్లి అనారోగ్యం, తండ్రి బాధ్యతారాహిత్యంతో గంగ జీవితం దినదిన గండంగా సాగుతుంది. వీరిద్దరూ ఎలా కలుస్తారు? వారి మధ్య ప్రేమ చిగురిస్తుందా? గతాన్ని అధిగమించి ముందుకు వెళ్లగలరా? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే జీ తెలుగులో సోమవారం నుంచి శనివారం వరకు రాత్రి 8 గంటలకు ప్రసారమయ్యే జయం సీరియల్ తప్పకుండా చూడాల్సిందే. ప్రముఖ నటుడు శ్రీరామ్ వెంకట్ మాట్లాడుతూ, "జయం ఒక ప్రత్యేకమైన కథ, ఇది ఇప్పటివరకు నేను పోషించిన పాత్రలకు భిన్నమైనది. బాక్సింగ్ కోచ్గా రుద్ర పాత్రలో నటించడం నాకు సవాలుగా, అదే సమయంలో ఉత్సాహంగా అనిపించింది. మా నటీనటులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారు. ప్రేక్షకులు ఈ ధారావాహికను తప్పకుండా ఆదరిస్తారని ఆశిస్తున్నాం," అన్నారు. జయం సీరియల్ జులై 14 నుంచి ప్రతి సోమవారం నుంచి శనివారం రాత్రి 8 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానుంది. ఈ సీరియల్ ప్రారంభంతో ఇతర ధారావాహికల ప్రసార సమయాల్లో స్వల్ప మార్పులు ఉంటాయి. జులై 14 నుంచి, చామంతి రాత్రి 8:30 గంటలకు, జగద్ధాత్రి రాత్రి 9 గంటలకు ప్రసారమవుతాయి. దయచేసి జీ తెలుగు ప్రేక్షకులు గమనించగలరు.

# వరి తెగులును అరికట్టడానికి బేయర్ ఫెలుజిత్

**విజయవాడ మేజర్ న్యూస్ :** వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ వంటి జీవ శాస్త్ర రంగాలలో కీలక సామర్థ్యాలు కలిగిన ప్రపంచ సంస్థ బేయర్, వరి సాగులో పాముపొడ తెగులు నుంచి అన్ని మొక్కల భాగాలకు రక్షణ కల్పించడానికి వినూత్న శిలీంద్ర సంహారిణి అయిన ఫెలుజిత్ను రూపొందించినట్టు బేయర్ క్రాప్ సైన్స్ విభాగం క్లస్టర్ కమర్షియల్ లీడ్ మోహన్ బాబు అన్నారు. ఈ ఉత్పత్తి జూలై నెల నుంచి దేశంలోని ముఖ్యమైన వరి పండించే రాష్ట్రాలన్నింటిలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. తెగుళ్లు, వ్యాధుల నుంచి పెరుగుతున్న సవాళ్లతో వ్యవసాయ రంగం పోరాడవలసి వస్తున్న పరిస్థితుల్లో.. నేలలో ఉద్భవించే ఈ నిరంతర వ్యాధి రైతులు ఎదుర్కొనే విధానాన్ని మార్చడానికి పెన్ఫ్లూఫెన్, టెబుకోనజోల్లను కలిపిన ప్రత్యేకమైన ఫార్ములాతో సిద్ధంగా ఉందన్నారు. దీనిని వినియోగిస్తే దాని ద్వంద్వ చర్య ద్వారా మొక్క దేహం అంతటా పాముపొడ తెగులు పెరుగుదలను సమర్థవంతంగా నిరోధిస్తుందన్నారు. రైతులకు పంట దిగుబడి నాణ్యతను పెంచే నమ్మకమైన పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. ప్రస్తుత మార్కెట్ ప్రమాణాల కంటే రెండు రెట్లు ఎక్కువ ఉండే ఉన్నతమైన సామర్థ్యాన్ని ఒక్క బేయర్ ఫెలుజిత్ స్ప్రే




అందిస్తుందన్నారు. రైతులు అనేక రకాలను వినియోగించాల్సిన అవసరం, భారం లేకుండా సమర్థవంతమైన వ్యాధి నియంత్రణను సాధించవచ్చునని చెప్పారు. రైతులకు అత్యంత ప్రభావవంతమైన పరిష్కారం ఫెలుజిత్, ఇది వారి వ్యవసాయ పద్ధతులను క్రమబద్ధీకరిస్తూనే పోడ తెగులుపై అద్భుతమైన నియంత్రణను అందిస్తుందన్నారు. ప్రపంచ ఆహార భద్రతలో వరి కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, తక్కువ వ్యయ ప్రయాసలు, పద్ధతులతో వ్యాధిని సమర్థవంతంగా నిర్వహించడానికి, తమ వనరులను సరైన విధంగా వినియోగించడానికి పెరుగుతున్న వ్యవసాయ సవాళ్ల మధ్య లాభదాయకతను పెంచడానికి ఈ ఆవిష్కరణ రైతులకు అవకాశం ఇస్తుందన్నారు. ఫెలుజిత్ యూఎస్పీ దాని ద్వంద్వ క్రియ ఫార్ములాలో ఉంది, పోడ తెగులు కు కారణమయ్యే ప్రధాన జీవి అయిన రైజోక్టోనియాను ఎదుర్కోవడానికి రెండు క్రియాశీల పదార్థాల బలాలను ఇది మిళితం చేస్తుందన్నారు. ఈ వినూత్న విధానం ప్రభావవంతమైన నియంత్రణను నిర్ధారించడమే కాకుండా అప్లికేషన్ సామర్థ్యాన్ని మెరుపరచడం ద్వారా స్థిరమైన వ్యవసాయ పద్ధతులకు మద్దతు ఇస్తుందని చెప్పారు.

# కూటమి రాకతో గ్రామాల్లో సుపరిపాలన





**గుడ్లవల్లేరు జూలై 11 మేజర్ న్యూస్ :** ఐదేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే తిరిగి అభివృద్ధిని పరుగులు పెట్టించిందని, గ్రామాలకు సుపరిపాలన అందుతుందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు అన్నారు. గుడ్లవల్లేరు మండలంలో ఎమ్మెల్యే రాము, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు శుక్రవారం విస్తృతంగా పర్యటించి, మండలంలోని వడ్లమన్నాడు, రెడ్డిపాలెం, వేమవరం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళుతూ ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యే రాము, కొనకళ్ళ, రావి సంక్షేమ పథకాల అమలులో సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటూ, ఏడాది పాలలో కూటమిప్రభుత్వం అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే రాము పలు సమస్యల పరిష్కారానికి సంబంధించిన శాఖల అధికారులకు ఫోన్లుచేసి, తక్షణ చర్యలు తీసుకున్నారు. ఇతర సమస్యలకు త్వరగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ప్రజలకు ఎమ్మెల్యే రాము భరోసా ఇచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలు మంగళ హారతులు, పూలమాలలతో ఘన స్వాగతం పలుకగా, కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామాల్లోని వంగవీటి మోహనరంగా, ఎన్టీఆర్ మహనీయుల విగ్రహాలకు నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి కుమార్, టిడిపి నాయకులు పోలవరపు వెంకటరావు, కొడాలి రామరాజు,కాగిత నరేంద్ర,పామర్తి కన్య భాస్కరరావు, దేవిశెట్టి రామకృష్ణ, శాయన ప్రసాద్,పాలేటి ఆంజనేయులు,సమ్మెట సాంబయ, ఈడే మోహన్, నిమ్మగడ్డ సత్యసాయి,కంచర్ల సుధాకర్,,అబ్దుల్ సత్తార్, బెజవాడ రాంబాబు, చిట్టిబొమ్మ నరసింహారావు వడ్లమన్నాడు, రెడ్డిపాలెం గ్రామాల నాయకులు పామర్తి సత్తిబాబు, పామర్తి సూరిబాబు, మోదుగమూడి కోటేశ్వరరావు, పండే శ్రీను, మెండ నాంచారయ్య, పెన్నేరు రమేష్, గరికపాటి రాంబాబు, గరికిపాటి వెంకటేశ్వరరావు, గరికపాటి నాగేశ్వరరావు, లక్ష్మయ్య, పుల్లేటి కిషోర్, కొనతం పెద్దిరాజులు, చింతయ్య, తోట రమేష్, వేమవరం గ్రామ పార్టీ అధ్యక్షులు అంకాలరావు, వేమవరం ప్రెసిడెంట్ మన్యం పద్మావతి,మన్నెం నరసింహారావు, వీర నాగేంద్రం, పామర్తి కొండబాబు, వంకా గౌరీ టిడిపి నాయకులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ఆయా గ్రామాల పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవు





**కంచికచర్ల జూలై 11 మేజర్ న్యూస్ :** పాసింజర్లతో వెళుతున్న ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనాలు నడిపేవారు ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తేకఠిన చర్యలు తప్పవని కంచికచర్ల ఎస్సై రాజు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ కి అంతరాయం కలిగిస్తూ రోడ్డుపై అడ్డదిడ్డంగా ఆటోలు నిలిపి ఫోన్లో మాట్లాడుతున్న ఆటో డ్రైవర్ల వద్ద నుంచి ఫోన్లు సీజ్ చేశారు. అదే విధంగా ఉదయం సమయంలో స్కూల్స్, కాలేజీకి వెళ్లే సమయంలో బస్టాండ్ చుట్టు ఆకతాయిగా కూర్చున్న వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా లైసెన్సు, వాహన కాగితాలు, ఇన్సూరెన్స్ తో పాటు యూనిఫాం కూడా ఉండాలని సూచించారు. వాహన కాగితాలు లేకపోతే వాహనాలు సీజ్ చేయటం జరుగు తుందన్నారు. బస్టాండ్ ఎదురుగా వాహనాలు నిలుప రాదని, ఆర్టీసీ బస్సులకు ఇబ్బంది కలిగించే ఆటో డ్రైవర్ల పై చర్యలు తీసుకుంటామన్నారు. బస్టాండ్ వద్ద ప్రతిరోజు పోలీస్ నిఘా ఉంటుందని ట్రాఫిక్ అంతరాయం కలిగించే ఆటో డ్రైవర్ల పై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

## శ్రీకొండలమ్మకు వేమవరం వాసుల ఆషాఢ సారె



**గుడ్లవల్లేరు జూలై 11 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో ఆషాడ మాస మహోత్సవములు సందర్భముగా ఈరోజు అనగా ది.11.07.2025 తేదీన శ్రీ కొండలమ్మ అమ్మవారికి ఆషాడ సారే (పట్టు వస్త్రములు) వేమవరం గ్రామ సువాసినులు, వేమవరం గ్రామ సర్పంచ్ మన్నెం పద్మావతి ఆధ్వర్యంలో గ్రామ సువాసినులు మేళ తాళములతో, పసుపు బిందెలతో సారే సమర్పించినారు. అనంతరము కొండిపాలెం గ్రామ ఆడపడుచులు, సువాసినులు అమ్మవారికి సారే సమర్పించినారు. ఈ కార్యక్రమములో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది దేవస్థానం సాంప్రదాయములో స్వాగతం పలికినారు. సారే సమర్పణ అనంతరము అమ్మవారి కి విశేషమైన పూజలు చేయించినారు. అని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండల రావు తెలిపినారు.

## పట్టణంలో ఫ్రైడే డ్రై డే సందర్భంగా పర్యటన




**నందిగామ, జులై 11, మేజర్ న్యూస్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టినటువంటి జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశానుసారం నందిగామ పట్టణ పరిధిలోని 8 సచివాలయ, 5 సచివాలయ పరిధిలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలలో మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా చైర్పర్సన్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం" ఫ్రైడే డ్రై డే "గా సంబోధిస్తూ దోమల పెరుగుదలని అరికడదాం, దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, వంటి వ్యాధులు రాకుండా కాపాడుకుందాం అలాగే ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆర్డి ఓ బాలకృష్ణ, ఎమ్మార్వో సురేష్ బాబు,మున్సిపల్ కమిషనర్ జి లోవరాజు, పట్టణ పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఏచూరి రాము, కాసర్ల లక్ష్మీనారాయణ, సీనియర్ తెదేపా నాయకులు వన భోతుల శ్రీరామ్,కూటమి నాయకులు వార్డు సచివాలయ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి ఒక్క బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించేలా తర్ఫీదు పొందాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శుక్రవారం మంగినపూడిలోగల జిల్లా పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో పోలీస్ అధికారులకు నిర్వహించిన ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, పాల్గొని ఫైరింగ్ ప్రక్రియ గూర్చి అధికారులకు పలు సూచనలు తెలియచేసినారు. ఫైరింగ్ సాధన ప్రక్రియలో జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని ఫైరింగ్ ప్రాక్టీస్ చేసే అధికారులలో ఉత్సాహాన్ని, మనోధైర్యాన్ని నింపారు. ఈ ఫైరింగ్ లో ప్రతి అధికారి పాల్గొని మంచి మెళకువలు నేర్చుకొని, ఫైరింగ్‌లో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ.ఫైరింగ్ రేంజ్‌లో క్రమశిక్షణ అత్యంత ప్రాముఖ్యం వహిస్తుందని, కావున ఫైరింగ్ రేంజ్ అధికారుల సూచనల మేరకు ఫైరింగ్ జాగ్రత్తగా, ఏకాగ్రతతో చెయ్యాలని, ప్రతి ఒక్క బుల్లెట్ టార్గెట్ బుల్స్ ఐ పడే విధంగా తర్ఫీదు పొందాలన్నారు. కొత్తగా వచ్చిన ఆయుధాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకొని అత్యవసర సమయాలలో ప్రజల, ప్రభుత్వ, ధన,ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలని సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమని,అదేవిధంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని జిల్లా పోలీసు శాఖ యొక్క ఉన్నతి కోసం ముందడుగు వేయాలని సూచించారు.

## డిసిఎంఎస్ చైర్మన్‌ను సత్కరించిన పిచ్చేశ్వరరావు



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన చిల్లంకుర్తి పిచ్చేశ్వరరావు మచిలీపట్నం జనసేన పార్టీ ఇన్చార్జి డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించి తన ఎన్నికపట్ల సహకారం అందించిన మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, బండి రామకృష్ణతో పాటు జనసేన పార్టీ శ్రేణులకు కూటమి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయ సాధనలో భాగస్వామ్యం కావాలని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా రైతులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. మార్కెట్ యార్డ్ పాలకమండలి నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. అనంతరం పిచ్చేశ్వరరావును బండి రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ శ్రేణులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు నెలకుర్రు సర్పంచ్ బొమ్మసాని నరేష్ జిల్లా కార్యదర్శి జన్ను నాగరాజు, జనసేన పార్టీ నాయకులు వడ్డీ చిరంజీవి, కర్రీ మహేష్, మహమ్మద్ సమీర్, మహమ్మద్ భాశి,రమేశ్ రూరల్ టౌన్ నాయకులు పాల్గొన్నారు.

## సాంకేతిక విద్యారంగంలో నిపుణులుగా ఎదగాలి



**చల్లపల్లి మేజర్ న్యూస్:** విద్యార్థులు సాంకేతిక విద్యారంగంలో నిపుణులుగా ఎదగాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం చల్లపల్లిలోని విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగిస్తూ ఇంటర్ విద్యార్థులు ప్రతిభతో పాటు కమ్యూనికేషన్స్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, ఎంపీపీ కోట విజయ రాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, సిఐ కే.ఈశ్వరరావు, ఎస్.వీ.ఎల్ క్రాంతి విద్యాసంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ దుట్టా శివప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందానికి సంపూర్ణ సహకారం అందించాలి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో పర్యటిస్తున్న కేంద్ర బృందానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలను అందజేసి సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో శిక్షణలో ఉన్న కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయి మానిటర్ ప్రభాత్ శర్మ తో కలసి సం బంధిత జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి జాతీయస్థాయి మానిటర్ జిల్లాకు వచ్చారని, వారు ఈనెల 20 వ తేదీ వరకు 3 మండలాల్లోని 16 గ్రామాల్లో పర్యటించి జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలిస్తారన్నారు.. వాటికి సంబంధించిన నివేదికలను ఏరోజుకారోజు సంబంధిత ఉన్నతాధికారులకు పంపుతారన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్, ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, సంసద్ ఆదర్శ గ్రామ యోజన, జాతీయ గ్రామీణ వాటర్ షెడ్ మిషన్, దీన దయాల్ అంత్యోదయ యోజన ,దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన, జాతీయ సామాజిక సహాయ యోజన, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, కృషి సంచాయ యోజన, డిజిటల్ ఇండియా భూమి రికార్డుల ఆధునీకరణ కార్యక్రమం వంటి పథకాల అమలు తీరుతెన్నులను గ్రామాల్లో పరిశీలిస్తారన్నారు. అంతే కాకుండా జలవనరులు, గ్రామీణ నీటి సరఫరా పథకాల పనులతో పాటు అంగన్వాడీ కేంద్రాలను కూడా పరిశీలిస్తారన్నారు.ఉయ్యూరు మండలంలో కలవపాముల, సాయిపురం, పెద్ద ఓగిరాల, కడవకొల్లు, ఆకులూరు, చిన్నవోగిరాల అని 6 గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటిస్తుందన్నారు. తొట్ల వల్లూరు మండలంలో గరికపర్రు, కుమ్మమూరు, బొడ్డపాడు, వల్లూరు పాలెం, ఐలూరు, భద్రరాజుపాలెం అనే 6 గ్రామాల్లోను, గూడూరు మండలంలోని కలపటం జక్కంచెర్ల, గండ్రం, మద్దిపట్ల అనే నాలుగు గ్రామాల్లో పర్యటిస్తుందన్నారు.కేంద్ర బృందం పర్యటించేందుకు వీలుగా గ్రామాల వారీగా ఒక షెడ్యూల్ తయారు చేయాలని, క్షేత్రస్థాయిలో అధికారులందరూ అందుబాటులో ఉండి వారికి కావలసిన ఖచ్చితమైన వివరాలను అందజేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయిలో నోడల్ అధికారిగా డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల స్థాయిలో ఎంపీడీవోలు నోడల్ అధికారులుగా వ్యవహరించాలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర బృందం సహాయకులు నందలాల్,డి ఆర్ డి ఎ పి డి హరిహరనాథ్, జెడ్పిసిఈఓ కే కన్నమ నాయుడు, డ్వామా పిడి శివప్రసాద్, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ నటరాజు, ఐ సి డి ఎస్ పి డి ఎం ఎన్ రాణి, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి వెంకటరావు, సర్వే భూమి రికార్డుల ఏడి జోషిల, జిల్లా వ్యవసాయ అధికారి మనోహర్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ రమణ రావు, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి నరేష్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పి4 పై మార్గదర్శి - బంగారు కుటుంబంపై ప్రత్యేక సమీక్ష



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో పి4 మార్గదర్శి – బంగారు కుటుంబం పై ప్రత్యేక సమీక్షా సమావేశం ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్ శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో గ్రామాల వారీగా ఇప్పటికే దత్తత తీసుకున్న కుటుంబాలు, ఇంకా దత్తత తీసుకోవాల్సిన కుటుంబాలు సంబంధించిన వివరాలను https://zeropovertyp4.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పరిశీలించారు. ప్రతి గ్రామంలో సంబంధిత అధికారులు ఆయా కుటుంబాలను వ్యక్తిగతంగా కలసి వారికి ఎటువంటి తోడ్పాటు కావాలో తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎండి ఇమ్రాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక, సామాజిక స్థాయిని మెరుగుపరచడం అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, మార్గదర్శకులుగా వ్యవహరించడమని తెలిపారు. మార్గదర్శులు తమ దత్తత కుటుంబాలకు మార్గనిర్దేశం చేయడమేకాకుండా, సలహాలు, సూచనలు, ప్రోత్సాహం ఇచ్చే పాత్రలో ఉండవచ్చని వివరించారు. ప్రతి ఒక్క మార్గదర్శి తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించి, ఆయా కుటుంబాలను అన్ని విధాలుగా ప్రోత్సహించి, వాటిని నిజమైన “బంగారు కుటుంబాలుగా” తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ కార్యక్రమాల సమన్వయంతో గ్రామీణ కుటుంబాల అభివృద్ధే పి4 ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశం గ్రామీణ అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగుగా భవిష్యత్తులో నిలుస్తుందని తెలియచేసారు. గ్రామాలలో ఉన్న ఉన్నత కుటుంబాల వారు పెద్ద మనసుతో ముందుకు రావాలని కోరారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# కేసులు సత్వర పరిష్కారానికే లోక్ ఆదాలత్, మీడియేషన్ సెంటర్లు




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సుప్రీంకోర్టు వారి ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా 90 రోజులలో అత్యధిక కేసులు పరిష్కారం కోసం మీడియేషన్ సెంటర్ ద్వారా కృష్ణ జిల్లాలో ఉన్న అన్ని న్యాయస్థానాలలో కేసులు పరిష్కారానికి న్యాయమూర్తులు న్యాయవాదులు కలిసికట్టుగా పనిచేయాలని కృష్ణా జిల్లా జి. గోపి అన్నారు.శుక్రవారం ఉదయం మచిలీపట్నం బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో జిల్లా జడ్జి జి. గోపి, జిల్లా న్యాయసవాధికారి సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య, ఇతర న్యాయమూర్తులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.పోతరాజు, న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా న్యాయ ప్రక్రియలో కూడా మార్పులు రావాలని, సత్వరమే న్యాయం అందిస్తే కక్షిదారులకు న్యాయ వ్యవస్థ పై నమ్మకం మరింత పెరుగుతుందని అన్నారు. లోక్ అదాలత్ మీడియేషన్ సెంటర్లో కేసులు పరిష్కరించి కక్షి దారులు శాంతియుత జీవనానికి అందరూ సహకరించాలని అన్నారు. కేసులు పరిష్కారంలో న్యాయవాదులు పాత్ర ఎంతో కీలకమైందని అన్నారు. దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసులు పరిష్కారం చేయకపోతే అవి పక్కదోవ పట్టే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. కేసులు పరిష్కారం చేయడంలో జిల్లా వ్యాప్తంగా 64 మంది ట్రైనింగ్ పొందిన న్యాయవాదులను సోషల్ వర్కర్లను మీడియేటర్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలియజేశారు 90 రోజులు స్పెషల్ డ్రైవ్ గా జిల్లాలో ఉన్న అన్ని బార్ అసోసియేషన్లో కేసులు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయవాదులు న్యాయమూర్తులు పరస్పర సహకారంతో కక్ష దారులకు సత్వర న్యాయం అందించినప్పుడు న్యాయశాఖ గౌరవ ప్రతిష్టలు మరింత పెరుగుతాయని, కక్షిదారులు కేసులు పరిష్కారం కోసం ముందుకు వస్తారని అన్నారు. శిక్షణ పొందిన మీడియేటర్లతో ఉభయ పార్టీలను శాంతియుతంగా పరిష్కరించి అప్పీల్ లేనివిధంగా తీర్పులు ఇవ్వడం జరుగుతుందని న్యాయవ్యవస్థలో రాబోయే రోజులలో మీడియేషన్ కు అత్యంత ప్రాముఖ్యత ఉంటుందని అన్నారు. పాత కేసులు పరిష్కరిస్తే కొత్త కేసులు వస్తాయని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.పోతురాజు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ బిల్డింగు శిథిల అవస్థలో ఉందని దానికి కావాల్సిన ఎస్టిమేషన్ 20 లక్షల రూపాయలతో రిపేర్లు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. జాతి కోసం మీడియేషన్ 90 రోజుల్లో కేసులు పరిష్కారం కోసం చేస్తున్న స్పెషల్ డ్రైవ్ లో న్యాయవాదులు అందరూ సహకరిస్తారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటివ్ లంకే వెంకటేశ్వరరావు, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, వడ్డీ జితేంద్ర తుంగల హరిబాబు కార్యదర్శి సాయన సుధాకర్ రావు ఇతర సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. లోకాదాలతో కేసులు పరిష్కారం చేసే సమయంలో న్యాయవాదులు తో సంబంధం లేకుండా పోలీసులు కక్షి దారులతో రాజి పత్రాలు పై సంతకాలు చేయిస్తున్నారని, దానివల్ల న్యాయవాద వృత్తికి అన్యాయం జరుగుతుందని న్యాయవాది మహమ్మద్ మస్తాన్ జిల్లా జడ్జి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్ సివిల్ జడ్జిలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, కృష్ణా జిల్లా పర్మనెంట్ లోకదాల చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కూటమి ఏడాది పాలనలో గ్రామాల్లో అభివృద్ధికి పెద్దపీట



## ఎమ్మెల్యే వెనిగండ్ల, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ, ఎస్డబ్ల్యూసి చైర్మన్ రావి

**గుడ్లవల్లేరు జూలై 11 మేజర్ న్యూస్ :** గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకల్ల నారాయణరావు లు పేర్కొన్నారు. గ్రామాల సమగ్ర అభ్యున్నతి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడు గ్రామంలో రూ. 33 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్డును గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాము, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, ఎస్డబ్ల్యూసి చైర్మన్ రావి వెంకటేశ్వర్రావు, కూటమినేతలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వడ్లమన్నాడు పాల కేంద్రం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, నూతన అధ్యక్షుడు పుల్లేటి రాజా ప్రసాద్, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. గత ఐదేళ్లుగా గ్రామాలు అభివృద్ధికి మంజూరైన నిధులను కూడా అరాచక ప్రభుత్వం పక్కదారి పట్టించిదని, స్థానిక సంస్థలకు విలువలేకుండ చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అందించడంతో పాటుగా, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ అభివృద్ధికి దూరమైన కృష్ణా జిల్లాలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. కృష్ణాజిల్లాలోని నాయకత్వం అంత ఏకతాటిపైకి వచ్చి, జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించినట్లు కొనకళ్ళ నారాయణ రావు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ శాయన పుష్పావతి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పొట్లూరి రవి కుమార్, మండల టిడిపి నాయకులు పోలవరపు వెంకటరావు, సురగని ప్రసాద్, కొడాలి రామరాజు, కాగిత నరేంద్ర, నారగాని శ్రీనివాసరావు, బొల్లా అంకాలు, పామర్తి కన్య భాస్కరరావు, దేవిశెట్టి రామకృష్ణ, శాయన ప్రసాద్, పాలేటి ఆంజనేయులు, సమ్మెట సాంబయ్య, దారా సత్యనారాయణ, పాల కమిటీ మెంబర్స్ ప్రెసిడెంట్ పుల్లేటి రాజా ప్రసాద్, మేనేజర్ తోట సత్యనారాయణ, సూపర్వైజర్ పి. బసవరాజ్ కుమార్, వేతన కార్యదర్శులు వేముల వీర కొండలరావు, టేస్టర్ ఆర్వీఎన్ పవన్ సాయి, ఎంపిడిఓ ఎండి ఇమ్రాన్, డిప్యూటీ ఎంపిడిఓ,ఈఓపిఆర్డీ ఎజెఎల్ నరసింహారావు, ఆర్ఐ హనుమంతరావు, ఎస్ఐ సత్యనారాయణ, పంచాయతీ రాజ్ జెఇ నాగేశ్వరరావు, కార్యదర్శి రమణ స్థానిక ప్రజలు, పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కక్షిదారులు మీడియేషన్ ద్వారా తమ కేసులను పరిష్కరించుకోండి



**నందిగామ, మేజర్ న్యూస్ :** నందిగామ కోర్టుల ప్రాంగణంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ 16వ అదనపు జిల్లా జడ్జి పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, ఏర్పాటు చేసిన మీడియేషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నందిగామ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా షేక్ రియాజ్ జడ్జి మాట్లాడుతూ రెండు వర్గాల మధ్య, కక్ష దారుల మధ్య ఉన్న అఘాదాన్ని తొలగించి మధ్య వర్తిత్వం ద్వారా వారికి తెలియపరచి వారిని రాజీ పడే విధముగా చేయటమే ఈ మీడియేషన్ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని, మధ్య వర్తిత్వం యొక్క లక్ష్యం వివాదాస్పదమైన అంశాలను పరిశీలించి ఇరువర్గాలకు ఆమోదయోగ్యమైన రాజీ చేయటమే ఈ మీడియేషన్ యొక్క లక్ష్యం అని, పార్టీలు వారి యొక్క సమస్యలు పరిష్కరించటానికి చర్చించటానికి అనుకూలమైన వేదిక అని ఎన్నో సంవత్సరముల నుండి ఉన్న కేసులను సత్వర పరిష్కరించటానికి కక్ష దారులకు అర్థమయ్యే రీతిలో చర్చించుకోవటానికి అనుకూలమైన వేదిక అని ఎన్నో సంవత్సరముల నుండి ఉన్న పెండింగ్ కేసులలో సమస్యలను పరిష్కరించి వారికి అనువైన పరిష్కార మార్గం చూపించడమే దీని ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మన కోర్టులలో అద్దంకి మణిబాబు, షేక్ ఆజాద్, కోయ దివ్య, అనే న్యాయవాదులు ఈ మీడియేషన్ ట్రైనర్స్ గా ఉన్నారని తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నెగంటి జీవరత్నం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టి జరుగుతుందని కక్ష దారులకు వారి యొక్క సమస్యలు తెలుసుకుని ఈ మీడియా ద్వారా సమస్యలను పరిష్కరించటమే ముఖ్య ఉద్దేశమని ఇరువర్గాల కక్ష దారుల యొక్క రాజీమార్గమే రాజ మార్గమని అందుకు ఖర్చు సమయం వృధా కాకుండా స్నేహపూరితమైన వాతావరణంలో అందరూ కలసి ఉండవచ్చును అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ ట్రెజరర్ మాడుగుల స్టాలిన్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ వేల్పుల కిషోర్, దారెల్లి అరుణ్ కుమార్, కస్తాల చరణ్, తాడేపల్లి కాంతారావు, మాజీ ఏపీపీ నంద్రు శ్రీరామ్ మూర్తి, షేక్ సైదా, షేక్ దాదా హుస్సేన్, గుడిసె సుమన్, బొబ్బిలిపాటి భాస్కరరావు, యరగొర్ల రామారావు, శెట్టి వెంకటేశ్వర్లు, కక్ష దారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జడ్జి కక్ష దారులకు రాజీ చేసుకునేందుకు కరపత్రాలను పంచినారు.

# ఏడాది కాలంలోనే సంక్షేమంతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం...

## ఎన్నికల ముందు హామీలను కూడా నెరవేరుస్తున్నాం....

## పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా



**తోట్లవల్లూరు జూలై 11 మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టామని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా ఎన్నో నెరవేర్చామని మిగిలినవి కూడా త్వరలో నెరవేర్చబోతున్నామని తెలిపారు. మండల పరిధిలోని వల్లూరుపాలెం, చినపులిపాక గ్రామాలలో జరుగుతున్న సుపరిపాలన – తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, అలాగే ఆయా గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులను పార్టీ నాయకులు, క్లస్టర్ ఇంచార్జిలు, యూనిట్, బూత్ ఇన్చార్జిలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా ప్రజల నుండి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలలో భాగంగా ఇప్పటికే తల్లికి వందనం చదువుతున్న పిల్లలందరికీ అందించామని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని, పెంచిన పింఛన్లు అధికారంలోనికి వచ్చిన మొదటి నెల నుండి అందిస్తున్నామని తెలిపారు. అలాగే ఈ నెలలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు వ్యవసాయ పెట్టుబడిని అందించనున్నామని, ఆగస్టు 15వ తేదీ నుండి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నామన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి గ్రామాలలో పలు సిసి రోడ్లను వేయడం జరిగిందన్నారు. రానున్న కాలంలో ప్రతి గ్రామంలోనూ అన్ని రోడ్లు సిసి రోడ్లుగా అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. అలాగే కొన్ని గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ఆ గ్రామాలలో డ్రైనేజీ నిర్మాణాలకు కూడా శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ స్థానిక నాయకుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని పరిష్కరింప చేసుకోవాలని ఎమ్మెల్యే కుమార్ రాజా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రజలు ఎమ్మెల్యే కుమార్ రాజాకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. తమ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశారని, దాంతో కొంతమేరకు తమ సమస్యలు పరిష్కారం అయ్యాయని ఈ సందర్భంగా ఆయా గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు తమకు అందుతున్నాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మహిళలు సైతం ఈ కార్యక్రమంలో పాల్గొని కుమార్ రాజాకు బొట్టుపెట్టి హారతులు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జోనల్ హెడ్, శాసనమండలి సభ్యులు మంతెన వెంకట సత్యనారాయణ రాజు, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరపనేని శివరామ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వీరంకి పరుశురాం, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు లతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

# వైసీపీ నేతకు సత్కారం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ విభాగానికి చెన్ను రంగారావు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం చల్లపల్లి మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నాయకులు చల్లపల్లి విచ్చేసిన రంగారావును సన్మానించారు. జమ్మిలంక అమ్మవారి ఆశీస్సులు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉప్పల ఉమామహేశ్వరరావు, ఉప్పల కృష్ణ కాంత్, ఉప్పల శేఖర్, ఈశ్వరపు సీతారామయ్య, ముస్లిం చైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కోసూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా కృష్ణవేణి



**మొవ్వ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని కోసూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా నెమలికంటి శ్రీ లక్ష్మీ కృష్ణవేణి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామ పంచాయతీ కార్యదర్శి గా పనిచేసిన శ్రీ లక్ష్మీ కృష్ణవేణి కోసూరు గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు కార్యదర్శిగా పనిచేసిన ఎం.ఎన్.ఎస్ మూర్తి బందరు మండలం ఎస్. ఎన్. గొల్లపాలెం గ్రామపంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. పంచాయతీ కార్యదర్శి గా బాధ్యతలు స్వీకరించిన శ్రీ లక్ష్మీ కృష్ణవేణికి గ్రామ పంచాయతీ, సచివాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

# యు.ఎఫ్.ఆర్టీఐ తోట్లవల్లూరు మండల కన్వీనర్‌గా మరీదు సాంబశివరావు నియామకం



**తోట్లవల్లూరు జూలై 11 మేజర్ న్యూస్:** యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ తోట్లవల్లూరు మండలం తోట్లవల్లూరు మండల కన్వీనర్‌గా మరీదు సాంబశివరావు నియమితులయ్యారు ఈ మేరకు ఈ ఎఫ్ ఆర్ టి ఐ రాష్ట్ర కోకన్వీనర్ జంపాన శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. మండల పరిధిలోని వల్లూరుపాలెం గ్రామానికి చెందిన సాంబశివరావు సమాచార హక్కు చట్టం ఉద్యమ ప్రచారకర్తగా, ప్రజాప్రయోజన అంశాలలో సహ చట్టంతో పనిచేసేందుకు ముందుకు రావడంతో ఆ నియామకం చేసినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తనపై నమ్మకంతో తనకు బాధ్యతలు అప్పగించిన శ్రీనివాస్ గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని ఈ సందర్భంగా సాంబశివరావు పేర్కొన్నారు.

# ప్రజల అవసరాన్ని గుర్తించి పని చేయడమే లక్ష్యం



**పమిడిముక్కల జూలై 11 మేజర్ న్యూస్:** ప్రజల అవసరాలను గుర్తించి వాటిని తీర్చడమే తమ కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పమిడిముక్కల మండల పరిధిలోని వేల్పూరు– కనుమూరు గ్రామాల నడుమ రేగోడు డ్రైవ్ పై గల వంతెన గత ఏడాది భారీ వర్షాల కారణంగా నవంబర్ నెలలో కూలిపోగా నూతన వంతెన నిర్మాణాన్ని చేపట్టారు. శుక్రవారం ఈ వంతెన ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కుమార్ రాజా మాట్లాడుతూ పలు గ్రామాల ప్రజలు ఈ వంతెన కూలిపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని పేర్కొన్నారు. తన దృష్టికి సమస్యను తీసుకురాగా తాను అసెంబ్లీలో నూతన వంతెన నిర్మాణానికి నిధుల మంజూరు గూర్చి మాట్లాడటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెంటనే స్పందించి రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ నుండి నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ కూడా నాలుగు నెలల వ్యవధిలోనే ఈ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడం అభినందనీయమన్నారు. 93 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ వంతెనను శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వేల్పూరు గ్రామస్తులు కుమార్ రాజాకు మేళ తాళాలతో ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రత్నం దిలీప్ కుమార్, స్థానిక ఎంపీటీసీ సభ్యులు కొడమంచిలి మహేష్, జెడ్పిటిసి సభ్యురాలు ఏనుగ వెంకట రమణకుమారి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జక్కా శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు. కాగా వంతెన నిర్మాణంతో విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారికి పమిడిముక్కల, మొవ్వ మండలాలకు చెందిన లోని పలు గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం ఏర్పడింది.



## పార్టీకి సేవలు అందించే వారికి ఎల్లప్పుడూ గుర్తింపు

**తోట్లవల్లూరు జులై 11 మేజర్ న్యూస్ :** తెలుగుదేశంపార్టీకి సేవలందించే వారిని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటుందని వారికి అడగకుండానే పదవులను కూడా ఇవ్వడం జరుగుతుందని పామర్రు శాసనసభ్యులు వరల కుమార్ రాజా పేర్కొన్నారు. మండల పరిధిలోని వల్లూరుపాలెం గ్రామంలో నూతనంగా నియమితులైన నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు, సంఘ సభ్యులు, అలాగే నూతన మండల కమిటీ అధ్యక్షునిగా నియమితులైన వీరపనేని శివరాం ప్రసాద్, గ్రామ కమిటీలకు నియమితులైన నాయకులను ఘనంగా సత్కరించారు. రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులుగా తిరిగి ఎన్నికైన వీరపనేని శివరామప్రసాద్, స్థానిక నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ రవీంద్రబాబు, సంఘ సభ్యులను, వల్లూరుపాలెం గ్రామ కమిటీ అధ్యక్షులు ఈడే వాసు, ప్రధాన కార్యదర్శి ధూపాటి వాసుబాబు లను ఎమ్మెల్యే కుమార్ రాజా ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవులు వచ్చిన వారంతా తమ పదవులకు న్యాయం చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన సేవలు అందించాలని, అలాగే పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.ఎ.సి.ఎస్ అధ్యక్షులు ఆచంట కోటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యూనిఫామ్ కుట్టడానికి అవకాశం కల్పిస్తాం



**మొవ్వ జులై 11 మేజర్ న్యూస్ :** డ్వాక్రా మహిళలు నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రానికి ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఉయ్యూరు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్ కుట్టి అందించేందుకు అవకాశాలు కల్పిస్తామని ఎంపీడీఓ డి. సుహాసిని అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కూచిపూడి లో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీడీఓ సుహాసిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కృష్ణాజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డిఆర్డిఏ పిడి పర్యవేక్షణలో కూచిపూడి లో గల కుట్టు శిక్షణ కేంద్రంలో కూచిపూడి నృత్య దుస్తులను సైతం కుట్టిన కుట్టి శిక్షణ కేంద్రం టీచర్ రమ్యను ఈ సందర్భంగా అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకం ద్వారా రుణాన్ని అందించేందుకు కృషి చేస్తానని ఎంపీడీఓ సుహాసిని శిక్షణ కేంద్రం నిర్వాహకులకు తెలిపారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**కంచికచర్ల జులై 11 మేజర్ న్యూస్ :** ప్రపంచ జనాభా దినోత్సవం, డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా కంచికచర్లలో శుక్రవారం అవగాహన ర్యాలీ జరిగింది. రాష్ట్రీయ బాలల స్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ మాధవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే అంటువ్యాధులు డెంగ్యూ, మలేరియా వంటి వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిలవకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైద్య ఆరోగ్య సిబ్బంది తరచు ప్రజలకు తగు సూచనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో బి ఎం లక్ష్మీ కుమారి,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మధురిమ, హెల్త్ సూపర్వైజర్ జీవి రాఘవేంద్ర రావు, యూనిట్ ఆఫీసర్ ఎం. శ్రీనివాస్ రావు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, హెల్త్ విజిటర్ బి. సారీలమ్మ, పీహెచ్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరస్తుల ఆటలకు చెక్ పెట్టిన గన్నవరం పోలీసులు



### గన్నవరం డి.ఎస్పి సి. హెచ్ శ్రీనివాసరావు

**గన్నవరం, జులై 11, మేజర్ న్యూస్ :** పలు సబ్ రిజిస్టర్ ఆఫీసులలో దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్తుల ఆటలకు చెక్ పెట్టిన గన్నవరం పోలీసులు నిందితుల వద్ద నుండి సుమారు 14 లక్షలు విలువైన ప్రభుత్వ స్టాంపులు, స్టాంపు పేపర్లు స్వాధీనం. వివరాల్లోకి వెళితే ఈ నెల 2వ తేది రాత్రి 08.30 నిమిషములకు గన్నవరం గ్రామానికి చెందిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లి మరుసటి రోజు 3 వ తేది ఉదయం 09.30 గం.ల. ఆఫీసు తెరిచే సమయానికి వచ్చి చూడగా ఆఫీసుకు వేసిన తాళం పగులగొట్టబడి ఉండి, ఆఫీస్ రికార్డు రూమ్ లో గల బీరువాలో ఉన్నటువంటి గవర్నమెంట్ స్టాంపులు, స్టాంప్ పేపర్లు దొంగిలించబడినాయి అని ఇచ్చిన ఫిర్యాదు పై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేయడమైనది. ఈ కేసుని సీరియస్ గా తీసుకున్న గన్నవరం పోలీసు వారు చాకచక్యంగా అతి తక్కువ సమయములో దొంగిలించేబడిన స్టాంపులు, దొంగతనానికి పాల్పడిన ముద్దాయిలను అదుపులోకి తీసుకున్నారు. పోలీస్ వారికి రాబడిన విశ్వసనీయ సమాచారం మేరకు కృష్ణ జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర రావు ఐ పి ఎస్ ఆదేశాలపై గన్నవరం సబ్-డివిజన్ డి.యస్.పి. సి.హెచ్. శ్రీనివాసరావు పర్యవేక్షణ లో, గన్నవరం సర్కిల్ సి.ఐ. బి.వి. శివ ప్రసాద్ ఆధ్వర్యంలో గన్నవరం ఎస్సై శ్రీధర్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలిసి ఒక టీమ్ గా ఏర్పడి టెక్నికల్, నాన్ టెక్నికల్ అంశాలను ఆధారం చేసుకొని శుక్రవారం ఉదయం 10.30 గం.లకు ఆగిరిపల్లి గ్రామం, నూజివీడు రోడ్ మార్జిన్లో సుమారు 35 నుండి 55 సం.ల మధ్య వయసు గల నలుగురు వ్యక్తులు వస్తూ పోలీస్ వారిని గమనించి పారిపోవుటకు ప్రయత్నించగా సి ఐ వారి సిబ్బంది సహాయంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వీరు విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో రిజిస్ట్రార్ ఆఫీసులో 2023, 2024 సంవత్సరంలో చేయబడిన దొంగతనాలు, గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో రిజిస్ట్రార్ ఆఫీసులో చేసిన నేరం గురించి అడిగి వారి వద్ద నుండి సమాచారం సేకరించి వారు చెప్పిన వివరాల ప్రకారం దొంగిలించబడిన స్టాంపులు, స్టాంప్ పేపర్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. స్వాధీనం చేసుకున్న గవర్నమెంట్ స్టాంపులు యొక్క విలువ సుమారు 14 లక్షలు ఉండవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గన్నవరం సర్కిల్ సి.ఐ. బి.వి. శివ ప్రసాద్, గన్నవరం ఎస్సై శ్రీధర్, క్రైమ్ సీఐ, క్రైమ్ ఎస్ఐ, స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జాలి స్విమ్మింగ్ పూల్ ప్రారంభించిన లంక లితీష్



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరంలోని పొందుగల రోడ్డులో జాలి స్విమ్మింగ్ పూల్‌ను తెలుగు యువత అధ్యక్షుడు లంక లితీష్, సర్పంచ్ మంజు భార్గవి, విశ్రాంతి ఉద్యోగి డిఇ నాగమల్లేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత మానవ జీవన విధానం లో స్విమ్మింగ్అనేది ఎంతో ఆరోగ్యవంతమైనదని, స్విమ్మింగ్ చేయడం వల్ల మనిషి దృఢంగాను,ఉల్లాసంగా ఉంటారన్నారు.దీనిని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని సూచించారుఈ కార్యక్రమంలో తెలుగు యువత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మోపర్రులో ప్రభుత్వ మెడికల్ బృందం సర్వే



**పెదపారుపూడి జులై 11 మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని వెంట్రప్రగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మోపర్రు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ కు డిపార్ట్మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ ప్రభుత్వ మెడికల్ బృందం విచ్చేసి పరిశీలన జరిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి సత్య నారాయణ చౌదరి అసిస్టెంట్ బృందం గ్రామంలో అసంఘటిత, సంఘటిత వ్యాధులపై నాలుగు రోజుల పాటు సర్వే నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఆశా కార్యకర్తలు, ఎమ్ ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎమ్ లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్ వైజర్లు, డాక్టర్ సందీప్, గ్రామ సర్పంచి ఈ సర్వేకు సహకారం అందించారు.



## దాతల దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకోండి

**ఘంటసాల, మేజర్ న్యూస్:** దాతల దాతృత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండల పరిధిలోని దేవరకోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు చదువుతున్న విద్యార్థులకు ఎన్నారై దోనేపూడి శాయిజీ ఆర్థిక సహకారంతో వారి తల్లి దోనేపూడి మునీశ్వరమ్మ జ్ఞాపకార్థం 23 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్సిల్లు, ఇతర విద్యా సామాగ్రిని అందించగా, దోనేపూడి నాగకృష్ణ మురళి - సుకన్య దంపతులు చేతుల మీదగా శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. సర్పంచ్ మద్దాల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ కొప్పుల రావులమ్మ, పంచాయతీ కార్యదర్శి సిహెచ్.కాంతారావు, హెచ్ఎం శివరాణి ఉపాధ్యాయుని ఐ.సాయి జ్యోతి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పావని, సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పలు గ్రామాలకు నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**పమిడిముక్కల జులై 11 మేజర్ న్యూస్ :** కృష్ణాపురం సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా 12వ తేదీ శనివారం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్ కో ఎఇ బి. శ్రీనివాసరావు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని కృష్ణాపురం, చోరగుడి, అలినఖిపాలెం, పెనుమత్స, గోపాల కృష్ణాపురం, ముసలినాయకుని పాలెం, గౌడపాలెం, ఐనపూరు, కూడేరు, శ్రీరంగపురం, లంకపల్లి, నిమ్మితాలగుంట, అప్పారావు పేట, గ్రామాలకు శనివారం సరఫరా ఉండదని తెలిపారు. పైన పేర్కొన్న గ్రామాలకు శనివారం మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందన్నారు. కావున ఆ గ్రామాల వినియోగదారులు విషయాన్ని గమనించి తమకు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

# గోవుల సంతతి అభివృద్ధికి బుల్ సెమన్ పంపిణీ



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** గోవుల సంతతి అభివృద్ధి చేసేందుకు చల్లపల్లి రాజా మనుమలు శ్రీమంతురాజా యార్లగడ్డ రామేశ్వరప్రసాద్, హరీశ్వరప్రసాద్లు శుక్రవారం బుల్ సెమన్ (ఎద్దుల వీర్యం) వైల్సును గోపాలమిత్రలకు ఉచితంగా అందచేశారు. చల్లపల్లి రాజా కుమారులు, మాజీ ఎంపీ యార్లగడ్డ అంకినీడు ప్రసాద్ బహద్దూర్ ఇటీవలకన్నుమూసిన విషయం తెలిసిందే. అంకినీడు ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.30వేల విలువైన 300 బుల్ సెమన్లను వీరవల్లి గ్రామం నుంచి తీసుకువచ్చి చల్లపల్లి రాజాకోటలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, మచిలీపట్నం, అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాలకు చెందిన గోపాలమిత్రలకు రామేశ్వరప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామేశ్వరప్రసాద్ మాట్లాడుతూ, గోవుల సం తానోత్పత్తికి దోహదపడేలా దశదిన కార్యక్రమం రోజున అచ్చు వేసిన ఆంబోతును గ్రామానికి సమర్పించే ఆనవాయితీ ఉంటుందన్నారు. తమ తండ్రి దశదిన కార్యక్రమాల సందర్భంగా ఆ సంప్రదాయాన్ని కొనసాగించాల్సి ఉందనీ, కానీ ఆంబోతును గ్రామానికి ఇచ్చినప్పటికీ బాగోగులు పట్టించుకునే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మారుతున్న కాలానికి అనుగుణంగా ఆ ఆలోచనను విరమించుకున్నామన్నారు. ఆ కార్యక్రమానికి బదులుగా గోవుల సంతానోత్పత్తి కి ఎద్దుల సెమను సమకూర్చి గోపాల మిత్రల ద్వారా గ్రామాల్లో ఆవులు కలిగిఉన్న వారికి ఉచితంగా ఈ సెమన్ ను అందించే ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు రావి రాజు, అడపా రవి, బొందలపాటి వీరబాబు, గోపాలమిత్రలు, ప్యాలెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. సెమన్ పంపిణీ ముఖ్య ఉద్దేశ్యాన్ని, కారణాలను గ్రామాల్లో ప్రజలకు తెలియచేయాలనీ, ఈ తరహా కార్యక్రమాలను ప్రోత్సహిస్తే సంప్రదాయాన్ని కొనసాగించినట్లు అవుతుందన్నారు.

# బీసీ హక్కుల సాధనకై చలో ఢిల్లీని విజయవంతం చేయండి

## జాతీయ అధ్యక్షులు డాక్టర్ లగుడు గోవిందరావు పిలుపు



**విజయవాడ జులై 11 మేజర్ న్యూస్ :** బీసీ హక్కుల సాధనకు జులై 20వ తేదీన జరిగే చలో ఢిల్లీ ని విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లగుడు గోవిందరావు అన్నారు. శుక్రవారం విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశములో 50 శాతం పైబడి ఉన్నటువంటి బీసీ సామాజిక వర్గానికి దశాబ్దాలుగా, అన్యాయం జరుగుతూనే ఉందన్నారు.బీసీ సామాజిక వర్గానికి జనాభా ప్రాతిపదికన సామాజిక, ఆర్థిక విబిన్న రంగాల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో కూడా పూర్తిగా అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో జూలై 21వ తేదీ ఢిల్లీ వేదికగా జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ సామాజిక వర్గానికి జనగణనతో పాటు కులగణను కూడా చేపట్టాలని,బీసీ సామాజిక వర్గానికి చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, బీసీలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని తెలిపారు.బిపి మండల్ కమీషన్ సిఫార్సులు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లో ప్రాధాన్యత కల్పించాలని, బీసీ రైతులకు 100 శాతం సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని అన్నారు.

బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థులుకు, విద్యార్థినిలకు స్కాలరు షిప్లు పెంచాలని, కేంద్ర బీసీ కమిషనులో ఖాళీగా ఉన్న సభ్యులను నియమించాలని చెప్పారు.వంటి ప్రధానమైన డిమాండ్లతో జూలై 20 తేదీన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నాం కాబట్టి ప్రతి ఒక్కరూ కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా బీసీ సామాజికవర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జనాభా దామాషా ప్రకారం తగిన ప్రాధాన్యత కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి వెంకటేశ్వరరావు, హరీష్ కుమార్, సాయిరాం, సాయికుమార్శరత్ కుమార్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం...

**నందిగామ, జులై 11, మేజర్ న్యూస్:**నందిగామలో అనధికారికంగా మద్యం లూజు విక్రయాలు బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.వి శివరామ్ హెచ్చరించారు. శుక్రవారం ఉదయం నందిగామ ఎక్సైజ్ కార్యాలయం వద్ద సీజ్ చేసిన మద్యం సీసాలను ధ్వంసం చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నందిగామ ఎక్సైజ్ పరిధిలో 17 మద్యం షాపులు ఉన్నాయని తెలిపారు. బెల్ట్ షాపులు ద్వారా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం షాపుల్లో లూజు మద్యం అమ్మినట్లు తెలిస్తే సదరు మద్యం షాపులను తక్షణమే సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనధికారిక మద్యం విక్రయాలపై నిగా పెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఎక్సైజ్ కార్యాలయం సిఐ, ఎస్ఐ యుగంధర్ సిబ్బంది పాల్గొన్నారు.

## డెంగ్యూ నివారణ కార్యక్రమంలో పాల్గొన్న దొండపాటి



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** కీర్తిరాయునిగూడెం గ్రామంలో నిర్వహించిన డెంగ్యూ నివారణ మాసోత్సవం ర్యాలీలో పాల్గొన్న మైలవరం మాజీ జెడ్పిటిసి దొండపాటి రాము. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఉదయం గోరువెచ్చని నీటిని తాగాలని ఎటువంటి విష జ్వరాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి దొండపాటి విజయ్ కుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు చనుమోలు శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పచ్చిగళ్ళ ధనలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే మా సంకల్పం

## ఘనంగా శ్రీ శ్రీనివాస గ్రావిటీ ఫ్రెషర్స్ డే వేడుకలు






**విజయవాడ మేజర్ న్యూస్ :** నైతిక ఋజువర్తనతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా తమ విద్యాసంస్థను నిర్వహిస్తున్నట్లు శ్రీ శ్రీనివాసా గ్రావిటీ విద్యాసంస్థల ఛైర్మెన్ పరుచూరి శ్రీనివాసరావు తెలిపారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్దార్థ కళాశాల ఆడిటోరియంలో శుక్రవారం శ్రీ శ్రీనివాసా గ్రావిటీ విద్యాసంస్థల ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి.. వారిలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పెంచి, ఉత్సహాన్ని నింపేలా ఫ్రెషర్స్ డే వేడుకలు జరిగాయి. నిత్యం ఏకరూప దుస్తుల్లో తరగతి గదుల్లో అధ్యాపకులు చెప్పే పాఠాలు వింటూ, నోట్స్ రాసుకుంటూ, పాఠ్యాంశాలను మననం చేసుకుంటూ గడిపే విద్యార్థులు, సాంప్రదాయ, పాశ్చాత్య వస్త్రధారణలో వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీ శ్రీనివాసా గ్రావిటీ విద్యాసంస్థల ఛైర్మెన్ పరుచూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, విజయవాడలో 2018లో తమ కళాశాలను స్థాపించినప్పటి నుంచి ఐఐటీ, నీట్‌లలో సీట్‌ల సాధనే లక్ష్యంగా విద్యార్థులకు బోధన చేస్తూ ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏటా పది నుంచి పదిహేను ఐఐటీ, ఎన్ఐటీ ర్యాంకులు తీసుకొస్తున్నామని, ఈ సంవత్సరం కూడా మంచి ర్యాంకులు సాధించామని చెప్పారు. మూడు దశాబ్ధాల క్రితమే శ్రీనివాసా విద్యాసంస్థల పేరుతో ఉయ్యూరులో స్థాపించడం జరిగిందని, అంచెలంచెలుగా ఎదుగుతూ గ్రావిటీ రూపంలో నేడు విజయవాడ, గన్నవరం, ఉయ్యూరు, పామర్రులో నాలుగు బ్రాంచ్‌లు కలిగి ఉందన్నారు. కానూరులో కూడా హాస్టల్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ చదువుతూ పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో వారిని ప్రోత్సహిస్తూ ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. శ్రీ శ్రీనివాసా గ్రావిటీ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పరుచూరి నీలిమ మాట్లాడుతూ, గ్రావిటీ విద్యాసంస్థలు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులకు కావాల్సిన కోర్సుల్లో చక్కగా రాణించేలా విద్య బోధనను అందిస్తోందని పేర్కొన్నారు. టీనేజ్‌లో వచ్చే శారీరక, మానసిక మార్పులతో సతమతమయ్యే విద్యార్థులకు కౌన్సిలింగ్ చేసి, చదువుపై దృష్టి పెట్టి రాణించేలా తమ నిపుణల బృందం పని చేస్తోందని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## విద్యతోనే సమూల మార్పు

### సర్పంచ్ ముప్పనేని



**ఘంటసాల, మేజర్ న్యూస్:** విద్యతోనే సమూల మార్పు వస్తుందని శ్రీకాకుళం సర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ పేర్కొన్నారు. మండల శ్రీకాకుళం పంచా యతీ పరిధిలో ఎంపీపీ స్కూల్‌లో మెగా పేరెంట్స్ డే సందర్భంగా ప్రధానో పాధ్యాయులు ఎడ్ల సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు తల్లిదండ్రుల మీద ఆధారపడి ఉందని కనుక విద్యార్థులు తల్లిదండ్రుల మాట విని వారి భవిష్యత్తుకు బాటలు చేసుకోవాలన్నారు. సర్పంచ్ రవిప్రసాద్ మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి విద్యార్థిని విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలని తల్లికి వందనం ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా ముందుకు తీసుకెళ్లాలని నాయకులకు తెలియజేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ఏ విద్యార్థి కూడా ఆర్థికంగా సామాజికంగా ఇబ్బందులు లేకుండా ముందుకు సాగాలని ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రారంభించారని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులకు కొండ బాబురావు మంచినీరు త్రాగుటకు విద్యార్థులకు 25 స్టీల్ గ్లాసులు అందించారు. ఉపాధ్యాయులు బుకినాల కృష్ణ, జనసేన నాయకులు సుగుణ పవన్ కుమార్ పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ బాబి స్కూల్ టీచర్, అంగన్వాడి టీచర్ కనకదుర్గ పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో ప్రారంభమైన శ్రీ లక్ష్మి పూర్విత శ్రీస్టోర్స్



**విజయవాడ, మేజర్ న్యూస్ :** హోమ్ కేర్ ప్రొడక్ట్స్ రశ్రీన్ వారి నూతన ఫ్రాంచైజ్ స్టోర్ ని స్థానిక సుందరయ్య నగర్, రాజీవ్ నగర్ లో శుక్రవారం సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చేతుల మీదగా ప్రారంభించారు. సంస్థ ఎండి పోలేపల్లి ఏ.వి. సుబ్బారావు మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో కావలసిన హోమ్ కేర్ ప్రొడక్ట్స్ అన్ని ఈ స్టోర్స్ లో సరసమైన ధరలకు లభించుతాయని తెలిపారు. ఫ్రాంచెస్ ఓనర్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రొడక్ట్ స్స అన్ని అన్ని హోల్సేల్ లో వినియోగదారులకు అందుబాటులో ఉంచేందుకు ఇది ప్రారంభించమని ఈ అవకాశాన్ని వినియోగదారులందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూండీ రాకేష్, పెనుగొండ సుబ్బా రాయుడు, 63 వ డివిజన్ కార్పొరేటర్ మోడుగుల తిరుపతమ్మ పలువురు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ పూల మార్కెట్ కూరగాయల మార్కెట్ తరలింపునకు పరిశీలన



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా అజిత్ సింగ్ నగర్, ఎక్సెల్ ప్లాంట్‌లో పర్యటించి వన్ టౌన్ రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్ పూల మార్కెట్, కూరగాయల ను తరలించేందుకు ఎక్సెల్ ప్లాంట్ వద్ద గల స్థలాన్ని పరిశీలించారు. సౌత్ సెంట్రల్ రైల్వే స్థలంలో ఉన్న విజయవాడ వన్ టౌన్ రాజీవ్ గాంధీ పూల మార్కెట్, కూరగాయల మార్కెట్ ను అజిత్ సింగ్ నగర్ ఎక్సెల్ ప్లాంట్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో తరలించేందుకు గల అవకాశాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఐఎన్టీఎస్ఓ ఒలంపియాడ్ పరీక్షల్లో..
# శ్రీ చైతన్య విజయ దుందుభి





**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** స్థానిక శ్రీ చైతన్య కృష్ణలంక శాఖలో ఇంటర్నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో ఎంపికయి విజయాన్ని సాధించిన విద్యార్థులకు మెడల్స్ ప్రధానం చేసి, కాంపిటేటివ్ పరీక్షల ప్రాధాన్యతను తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె మహాలక్ష్మి మాట్లాడుతూ ఒలింపియాడ్ పరీక్షలలో పాల్గొనడం అనేది ఇతర పోటీ పరీక్షలకు, ఉన్నత విద్య కోసం ప్రవేశ పరీక్షలు వంటి భవిష్యత్తు సవాళ్లకు అద్భుతమైన తయారీగా ఉపయోగపడుతుందన్నారు. ఒలింపియాడ్ల నుండి పొందిన అనుభవం, నైపుణ్యాలు అమూల్యమైనవన్నారు. భవిష్యత్తులో విజయానికి విద్యార్థులకు బలమైన పునాదిని అంది స్తాయని ఉద్ఘాటించారు. పాఠశాలలో సుమారు 180 మంది విద్యార్థులు ఒలిపియాండ్ పరీక్షల్లో ఎంపికయి, ట్యాబ్, స్మార్ట్ వాచ్, లంచ్ బ్యాగ్లు, జామెంట్రి బాక్సులు, గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్స్, మొదలైన బహమతులు గెలుచుకున్న వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఈ జియం మురళికృష్ణ, ఆర్.ఐ.జె. రాజేష్ బాబు, కోఆర్డినేటర్ సి.హెచ్.సురేష్, ఇన్ చార్జులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## వైఎస్.జగన్ మోసపు అబద్ధాలు చెప్పడం మానుకో...



**నందిగామ, జూలై 11, మేజర్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రజలను మోసం చేస్తున్నాడని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి యలగాల నూకానమ్మ యాదవ్ అన్నారు. శుక్రవారం పత్రిక ప్రకటన తెలుపుతూ మామిడి రైతులను పరామర్శిస్తానని చెప్పి, చిత్తూరు జిల్లా బంగారుపాళం వెళ్లి చేసింది ఏంటి.మామిడి మార్కెట్ యార్డు వద్ద దండయాత్ర చేశాడు. ఒక్క రైతు తో కూడ మాట్లాడింది లేదు. వైసిపికి చెందిన తోతపురి మామిడి కాయలను ట్రాక్టర్లలో తీసుకొచ్చి రోడ్డుపై పోసి తొక్కిస్తారా,వేరే రైతులు మామిడి కాయలు మార్కెట్ కి తీసుకు వస్తుంటే రెండు ట్రాక్టర్లును బలవంతంగా వైసిపి నాయకులు లాక్కోని, రప్పా రప్పా నరికకస్తామని నినాదాలు చేయిస్తారా అని ప్రశ్నించారు.నీ హయంలో తోతపురి మామిడి కాయలకు నువ్వు ఇచ్చిన ధరఎంత కిలో 8 రూపాయలు ఇప్పుడు పన్నెండు రూపాయలు ఇస్తున్నారు కదా, నాలుగు రూపాయలు అదనంగా బోనస్ ఇచ్చి కూటమి ప్రభుత్వం కొంటున్నాను. దీనికి గాను 260 కోట్లు రూపాయలు కూటమి ప్రభుత్వం ఇచ్చింది.రాష్ట్ర ప్రజలకు సుపరిపాలనను కూటమి ప్రభుత్వం అందించి, అభివృద్ధి చేస్తూ, సంక్షేమాన్ని అందిస్తూంటే, ఏమీ మాట్లాడలో జగన్ రెడ్డికి తెలియక, తీవ్ర అసహనంలో ఉండి అరాచకాలు,దండయాత్రలు చేస్తున్నారు నీ మోసం ప్రజల చూస్తున్నారు.ప్రభుత్వం ఇలాంటి వాళ్లని నియంత్రించాలని, శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూడాలని మనవి చేశారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, ఏ.కొండూరు, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999



కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్
కేంద్ర కార్యాలయము : మచిలీపట్నం, ఫోన్ : 9866057711
ప్రాంతీయ కార్యాలయము : విజయవాడ, ఫోన్ : 9866057171



నెట్టెం శ్రీ రఘురామ్
చైర్మన్, కెడిసిసి బ్యాంక్, మచిలీపట్నం

బ్యాంకు అందిస్తున్న సేవలు
- అన్ని బ్యాంకుల కంటె సేవింగ్స్ మరియు టర్మ్ డిపాజిట్ల పై అత్యధిక వడ్డీ ఇస్తున్న బ్యాంకు.
- బ్యాంకు డిపాజిట్ల పై రూ. 5 లక్షల వరకు ఇన్సూరెన్స్ భద్రత.
- అన్ని బ్రాంచీలలో ATMల సౌకర్యం.
- ATM లేని గ్రామాలకు మొబైల్ ATM వ్యాన్ సౌకర్యం.
- ఖాతాదారులకు ATM & RUPAY డెబిట్ కార్డుల సౌకర్యం
- మొబైల్ బ్యాంకింగ్ యాప్ ద్వారా RTGS / NEFT / IMPS సేవల సదుపాయం.
- అన్ని బ్రాంచీలలో ఖాతాదారులకు సేఫ్ డిపాజిట్ లాకర్ల సదుపాయం.

MOBILE BANKING APPLICATION
Step 1 : Open Play Store (Or) QR COde Scanner
Step 2 : Search "Krishna DCCB A.P."
Step 3 :
Scan QR Code & Download Mobile APP

ది. 23-4-2025 నుండి డిపాజిట్ల పై చెల్లించు వడ్డీరేట్లు (సం॥నకు)
సేవింగ్స్ డిపాజిట్ల పై - 4.00%
ఫిక్స్‌డ్ డిపాజిట్ల పై
15 రోజుల నుండి 90 రోజుల వరకు 6.00 %
91 రోజుల నుండి 180 రోజుల వరకు 6.50 %
181 రోజుల నుండి 364 రోజుల వరకు 7.00 %
1 సంవత్సరము నుండి 3 సంవత్సరముల వరకు 7.50 %
3 సంవత్సరముల ఒక్కరోజు మరియు ఆపైన 8.00 %
సీనియర్ సిటిజన్స్‌కు 0.75% / పి.ఏ.సి.యస్.లకు 0.75% అదనముగా ఇవ్వబడును.

ఇతర వివరములకు మీ సమీప కృష్ణా డిసిసిబి బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు